సాక్షి నంద్యాల

శుక్రవారం: 28 ఏప్రిల్: 2023



శ్రీశైలంలో కేంద్ర మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను గురువారం కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత సహాయ మంత్రి శృతిప్రతిమ భూమిక్ దర్శించుకున్నారు.



ఘనంగా గ్రామోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలేశుని జయంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం యోగా నృసింహ గరుడ వాహనంపై కొలువుదీరిన ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు.



ఉత్సవాలకు వేళాయే!

కోవెలకుంట్ల పట్టణంలో ఈ నెల 30వ తేదీ నుంచి పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభకానున్నాయి. వచ్చే నెల 11వ తేదీన వేడుకలు ముగియనున్నాయి.

8లో

న్యూస్‌రీల్

ఘనంగా భగీరథ జయంతి వేడుకలు



బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో భగీరథ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: పట్టణంలో భగీరథ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీసీ వెల్ఫేర్ అధికారిణి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాలలు వేసి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సగరుల ఆరాధ్యదైవమైనటువంటి భగీరథుడి జయంతిని జరిపేలా ప్రభుత్వం ఆదేశించిందన్నారు. పట్టణంలోని ఎస్బీఐ కాలనీ వద్ద ఉన్న భగీరథ సర్కిల్‌లో వైఎస్సార్సీపీ పట్టణ బీసీసెల్ అధ్యక్షులు టైలర్ శివయ్య ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టెక్కె శిల్పా మహిళా బ్యాంక్ సమీపంలో మాజీ కౌన్సిలర్ మధుసాయి ఏర్పాటు చేసిన భగీరథ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 2 సంవత్సరాల వ్యవధితో మంజూరు

కర్నూలు(సెంట్రల్): రెండు సంవత్సరాల కాల వ్యవధిలో పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరుకు శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ జి.సృజన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు www.ipr.ap.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ప్రభుత్వం కొత్తగా అక్రిడిటేషన్ కార్డుల మంజూరు కొరకు జీవో 38 (తేదీ 30.3.2023) జారీ చేసిందన్నారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, పాస్ పోర్టు సైజ్ ఫొటో, అవసరమైన డాక్యుమెంట్లు పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మితే చర్యలు

ఆళ్లగడ్డ/శిరివెళ్ల: అధిక ధరలకు మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం నియోజకవర్గంలోని చాగలమర్రి, ముత్యాలపాడు, ఆలమూరు, రుద్రవరం, నరసాపురం, శిరివెళ్లలోని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల దగ్గర మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో ధరలు, సమయపాలనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకోకూడదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తామన్నారు. ఈయన వెంట సిబ్బంది నాగరాజు, ఆంజనేయులు ఉన్నారు.

29న నవోదయ పరీక్ష

కర్నూలు సిటీ: 2023–24 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డి తెలిపారు. గురువారం నవోదయ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లతో పాటు సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఈఓ మాట్లాడుతూ పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 22 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 7767 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులు అర గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో నవోదయ విద్యాలయ(బనవాసి) ప్రిన్సిపల్ కె.సాగరిక, సీఎస్, డీఓలు పాల్గొన్నారు.

రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయండి

నంద్యాల: గ్రామాల్లో చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర భూ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సూచించారు. గురువారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రీ సర్వే ప్రక్రియను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. గ్రౌండ్ ట్రూథింగ్, ఫైనల్ ఆర్ఓఆర్, డ్రోన్ ఫ్లయింగ్ తదితర ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. గ్రౌండ్ ట్రూథింగ్, ఫైనల్ ఆర్ఓఆర్, 13 నోటిఫికేషన్ తదితర ప్రక్రియల్లో కూడా పురోగతి కనిపించాలన్నారు. రోవర్ల ద్వారా హద్దురాళ్లు నాటే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, ఇన్‌చార్జి డీఆర్ఓ కామేశ్వరరావు, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరామ్ పాల్గొన్నారు.

పంటలకూ ఆరోగ్య కేంద్రాలు!

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్
- జిల్లాలో మొదటి విడతలో 29 కేంద్రాలు గుర్తింపు
- పురుగు, తెగుళ్ల ఉధృతి గుర్తించేందుకు ల్యాబ్‌లు
- పీహెచ్‌డీసీ డాక్టర్లుగా ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు
- అనుబంధంగా తోటబడి, పొలంబడి ట్రైనర్లు
- వ్యవసాయ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ
- దిగుబడులకు భరోసా

వ్యవసాయమే జీవనాధారం చేసుకున్న అన్నదాతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడుతోంది. పంట సాగుకు పెట్టుబడి, నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు ఇలా ప్రతి విషయంలోనూ సాయపడుతోంది. తాజాగా అధిక దిగుబడుల సాధనకు పంటల్లో చీడపీడల నివారణ చర్యలపై సలహాలు, సూచనల కోసం రైతు భరోసా కేంద్రాల్లో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు (పీహెచ్‌డీసీలు) ఏర్పాటు చేస్తుంది. జిల్లాలో మొదటి విడతలో మండలానికి ఒకటి చొప్పున అవి అందుబాటులోకి రానున్నాయి.



పీహెచ్‌డీసీగా ఎంపికైన కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె రైతు భరోసా కేంద్రం

కోవెలకుంట్ల: జిల్లాలో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో 2.28 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, కంది, వేరుశనగ, మొక్కజొన్న, మినుము, పొద్దుతిరుగుడు, ఆముదం, ఉల్లి, జొన్న పంటలు, రబీ సీజన్‌లో 1.84 లక్షల హెక్టార్లలో పప్పుశనగ, జొన్న, ధనియాలు, వరి, మొక్కజొన్న, తదితర వ్యవసాయ, మిరప, బత్తాయి, నిమ్మ, అరటి, బొప్పాయి, మామిడి, దానిమ్మ, జామ, తదితర ఉద్యాన, వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో రైతులు అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా పురుగు మందులు వాడటం, సరిగ్గా పిచికారీ చేయకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయి. దీనికితోడు కొన్నిసార్లు అధిక వర్షాలు, వాతావరణం అనుకూలించక పంటలకు చీడపీడలు ఆశిస్తున్నాయి. వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక రైతులు రకరకాల క్రిమి సంహారక మందులు వాడుతున్నారు. అడ్డగోలు పురుగు మందుల వాడకంతో సమస్యలు మరింత పెరగడంతో పాటు సరైన దిగుబడులు రాక కర్షకులు ఆర్థికంగా నష్టపోతున్నారు. వీటన్నింటిని గుర్తించిన ప్రభుత్వం తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు చీడపీడలను సకాలంలో గుర్తించి వాటి నివారణకు పరిష్కారమార్గాలు సూచించడమే లక్ష్యంగా పీహెచ్‌డీసీలను నెలకొల్పుతోంది.

ఖరీఫ్‌సీజన్‌కు అందుబాటులోకి పీహెచ్‌డీసీలు

నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలో 411 రైతు భరోసా కేంద్రాలు ఉండగా మొదటగా ప్రతి మండలంలో ఒకటి చొప్పున 29 పీహెచ్‌డీసీలను 2023–24 ఖరీఫ్ సీజన్ నాటికి అందుబాటులోకి తెచ్చేందుకు వ్యవసాయశాఖ కసరత్తు చేస్తోంది. ఆయా మండలాల్లో ఏ గ్రామంలో పీహెచ్‌డీసీ ఏర్పాటు చేయాలో గుర్తించి అందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందించారు. సొంత భవనం ఉన్న రైతు భరోసా కేంద్రంలో పీహెచ్‌డీసీ ఉంటుంది. ఆ సెంటర్ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యతగా అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టికల్చర్ ఎమ్మెస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లను ఎంపిక చేస్తారు. పై అర్హతలు లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ, హార్టికల్చర్ బీఎస్సీ చేసిన ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవకాశం కల్పిస్తారు. వీరు కూడా లేకపోతే అగ్రికల్చర్, హార్టికల్చర్‌లలో డిప్లమో చేసిన వారిని ఎంపిక చేస్తారు. డాక్టర్లుగా ఎంపికైన ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు వివిధ పంటలకు సంబంధించి చీడపీడల నివారణ పద్ధతులు, అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు, సలహాలు అందజేస్తారు. పీహెచ్‌డీసీలో తెగుళ్లు, పురుగు మందుల ఉధృతిని గుర్తించేందుకు రూ. 50 వేలతో పరీక్షా పరికరాలను సమకూర్చేందుకు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు.

మూడు విడతలుగా శిక్షణ

ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్ల డాక్టర్లు, అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. పొలంబడి ట్రైనర్స్‌లో జిల్లా వనరుల కేంద్రానికి చెందిన ఇద్దరు ఏఓలు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉద్యానవన అధికారులు ఉంటారు. వీరందరికీ మూడు విడతలుగా శిక్షణ ఇస్తారు. ఈ నెలాఖరు నుంచి మొదటి విడత శిక్షణ మూడు వారాల పాటు నిర్వహించేందుకు వ్యవసాయశాఖ జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నంద్యాల రైతు శిక్షణా కేంద్రం, యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రాల్లో శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయి. శిక్షణలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు సోకే చీడపీడలు, వాటి లక్షణాలు, నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. పంటలకు సోకే వైరస్‌లు, వాటిని నివారించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారు. అలాగే సూక్ష్మపోషకాల లోపాలు, వాటి లక్షణాలు, లోప నివారణకు చేపట్టాల్సిన పద్ధతులను తెలియజేస్తారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగులో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ మండలంలోని పీహెచ్‌డీసీలో నిర్ధారించి పరిష్కారమార్గం సూచించి ఆయా పంటల్లో అధిక దిగుబడుల సాధనకు కృషి చేస్తారు.

ఖర్చు తగ్గుతుంది



నాకున్న మూడు ఎకరాల సొంత పొలంతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రతి ఏటా వ్యవసాయం చేస్తున్నాను. పీహెచ్‌డీసీ ఏర్పాటుతో ఆయా పంటలకు సోకిన చీడపీడలను వెంటనే గుర్తించి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు అవకాశం కలుగుతుంది. దీని ద్వారా క్రిమి సంహారక మందుల పిచికారీ తగ్గి పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

– కుళాయప్ప, రైతు, అమడాల, కోవెలకుంట్ల మండలం

రైతులకు ఉపయోగకరం



హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్లు రైతులకు చాలా ఉపయోగకరం. కోవెలకుంట్ల మండలం సొదరదిన్నె రైతు భరోసా కేంద్రాన్ని మొదటి విడతగా పీహెచ్‌డీసీకి ఎంపిక చేశారు. వీటి ద్వారా ఆయా సీజన్లలో పంటలకు సోకిన వైరస్, తెగుళ్లను తెలుసుకోవడం, నివారణకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో మంచి దిగుబడులు సాధించేందుకు వీలవుతుంది.

– నిరంజన్, ఏఓ, కోవెలకుంట్ల

బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించండి

- రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: కర్నూలు, నంద్యాల జిల్లాలలో బడి బయట ఉన్న పిల్లల సంఖ్య అధికంగా ఉందని, వీరిని పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ జిల్లాలో బడి బయట ఉన్న 1,233 మంది పిల్లల్లో 211 మంది పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. మిగిలిన పిల్లల్లో కొంత మంది తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లారని, వలస వెళ్లడానికి గల కారణాలను కూడా ఏపీఎంలతో సర్వే చేయించామన్నారు. బడి బయట ఉన్న పిల్లలందరినీ గుర్తించి పాఠశాలలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, రక్తహీనత నివారణ తదితర అంశాలపై వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జవహర్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించి వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువ బరువు ఉన్న పిల్లలపై ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అవ్వాతాతలకు ఉచితంగా కంటివైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అర్బన్ హెల్త్‌సెంటర్లలో ఖాళీలను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నపిల్లల ఆధార్ అప్డేషన్ మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎడ్యుకేషన్, శిశు సంక్షేమ శాఖ, వైద్యశాఖ పలు అంశాలపై సమీక్షించి కలెక్టర్లకు, చీఫ్ సెక్రటరీ పలు సూచనలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జి డీఆర్ఓ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆణిముత్యం

- ఇంటర్‌లో సత్తా చాటిన విద్యార్థిని
- 973 మార్కులతో నంద్యాల జిల్లా టాపర్
- 15 ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీ గ్రూపులో ప్రథమస్థానం



తల్లిదండ్రులతో అమృత

కోవెలకుంట్ల: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో 973 మార్కులు సాధించి బనగానపల్లె మండలం కొత్తపేట గ్రామానికి చెందిన అమృత నంద్యాల జిల్లా టాపర్‌గా నిలిచింది. తండ్రి సంజీవరాయుడు కోవెలకుంట్ల పట్టణ శివారులోని గురుకుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన భార్య వ్యవసాయ, కూలీ పనులకు వెళుతోంది. అమృత.. కోవెలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఇంటర్ పూర్తి చేసుకుంది. ప్రథమ సంవత్సరంలో 457 మార్కులు సాధించింది. రెండు రోజుల క్రితం విడుదలైన ఫలితాల్లో 973 మార్కులు కైవసం చేసుకుని నంద్యాల జిల్లాలో టాపర్‌గా నిలిచింది. ద్వితీయ సంవత్సర ఇంగ్లిష్‌లో 92 మార్కులు, తెలుగులో 98, గణితం పేపర్–1లో 75, పేపర్–2లో 73, ఫిజిక్స్‌లో 60, కెమిస్ట్రీలో 58 మార్కులతోపాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రాక్టికల్స్‌లో 60 మార్కులతో 516 మార్కులు సాధించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 973 మార్కులు వచ్చాయి. జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా ఎంపీసీ గ్రూపులో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. పేదింటి విద్యార్థిని ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటడంతో కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

ఇంజినీర్ కావాలన్నదే లక్ష్యం



ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో నంద్యాల జిల్లాలో మొదటి స్థానం రావడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాను. ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి బీటెక్ పూర్తి చేసి ఇంజినీర్‌గా రాణించాన్నదే ముందున్న లక్ష్యం. – దాసరి అమృత

వచ్చే నెల 24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నంద్యాల(సిటీ): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సరం) నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ గురువయ్యశెట్టి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మే నెల 24న మొదటి లాంగ్వేజ్, 25న ఇంగ్లిష్, 26వ తేదీన గణితం పేపర్–1, బోటనీ, సివిక్స్, 27న గణితం పేపర్–2, జువాలజీ, హిస్టరీ, 29న ఫిజిక్స్, ఎకనామిక్స్, 30న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ పేపర్, 31న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జ్ కోర్సు, మ్యాథమ్యాటిక్స్, జూన్ 1న మోడరన్ ల్యాంగ్వేజ్, జియోగ్రఫీ పరీక్షలు ఉంటాయన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 5 నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయన్నారు. సప్లిమెంటరీ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు మే 3 వ తేదీలోగా.. రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ కొరకు మే 6వ తేదీలోగా ఫీజులు చెల్లించాలన్నారు. వివరాలకు http://bieap.apcfss.in వెబ్‌సైట్ చూడవచ్చన్నారు.

ఆర్‌టీఓగా బాధ్యతలు చేపట్టిన శివారెడ్డి



నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లా ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా జీవీ శివారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆదోని ఆర్‌టీఓగా విధులు నిర్వహిస్తున్న శివారెడ్డి బదిలీపై నంద్యాల జిల్లా ఆర్‌టీఓగా వచ్చారు. నంద్యాల ఆర్‌టీఓగా(ఎఫ్ఏసీ) ఎంవీఐ శ్రీకాంత్ విధులు నిర్వహించేవారు.

మహానంది కోనేరులో గంగమ్మకు పూజలు చేస్తున్న దృశ్యం



గంగాదేవికి విశేష చూర్ణాభిషేకం



గంగాదేవిని మహానంది కోనేరులోకి తీసుకెళ్తున్న ఈఓ, చైర్మన్, పండితులు

మహానంది: వైశాఖ శుద్ధసప్తమి సందర్భంగా మహానందిలో గురువారం గంగాదేవికి విశేష చూర్ణాభిషేకం నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, అర్చకులు మూలస్థానం సుబ్బయ్యశర్మ, శరభయ్యశర్మ, వేదపండితులు, అర్చకుల బృందం ఉదయాన్నే రాజగోపురం వద్ద గంగాదేవికి ప్రత్యేక పీఠంలో కొలువుంచారు. అర్ఘ్యపాద్యాదులు సమర్పించి మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో రుద్రగుండం పుష్కరిణిలోకి తీసుకెళ్లి విశేష చూర్ణాలతో అభిషేకం, అలంకార హారతులు ఇచ్చి సంకల్పస్నానం చేయించారు. వేలాది సంఖ్యలో భక్తులు పుష్కరస్నానం ఆచరించి వైశాఖ శుద్ధసప్తమి పుణ్యఫలాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, కూరగాయల దాత టి.ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

దందాకు లైసెన్స్!

- నంద్యాల ఆర్టీఓ కార్యాలయంలో దళారుల హవా
- కొందరు సిబ్బందితో కుమ్మక్కు
- నేరుగా వెళ్తే టెస్ట్ ఫెయిల్.. మామూళ్లు ఇస్తే పాస్

➡ కొలిమిగుండ్ల మండలానికి చెందిన ఓ వ్యక్తి ఎల్ఎల్ఆర్ కోసం ఏజెంట్‌తో సంబంధం లేకుండా వెళ్లి ఆన్‌లైన్ పరీక్షలో ఫెయిల్ అయ్యారు. మరో నెల తరువాత ఏజెంట్ ద్వారా వెళ్లి ఆన్‌లైన్ పరీక్షలో పాస్ అయి, లైసెన్స్ కూడా పొందారు.

➡ అవుకు మండలానికి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఏజెంట్‌తో సంబంధంగా లేకుండా ఇప్పటికే మూడు సార్లు ఆన్‌లైన్ పరీక్షకు హాజరయ్యాడు. దిక్కుతోచక చివరికి ఏజెంట్‌ను ఆశ్రయించి మళ్లీ దరఖాస్తు చేసుకున్నాడు.

➡ చాగలమర్రి మండలానికి చెందిన ఓ వ్యాపారి ఏజెంట్‌కు రూ.6 వేలు చెల్లించి టూవీలర్, ఫోర్ వీలర్‌కు లైసెన్స్ పొందారు.

... నంద్యాల ఆర్టీఓ కార్యాలయంలో ఏజెంట్ల హవాకు ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. వారి ప్రమేయం లేకుండా ఇక్కడ పని జరగదు.

నంద్యాల(రూరల్): డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ తదితర పనుల మీద నంద్యాల ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లిన వారికి అక్కడక్కడా కొన్ని బోర్డులు కనిపిస్తాయి. కార్యాలయ పని మీద వచ్చే వారు దళారులను ఆశ్రయించ వద్దని, నేరుగా స్లాట్ బుక్ చేసుకుంటే నిబంధనల మేరకు పని పూర్తవుతుందని రాసి ఉంటుంది. కాని అక్కడి జరిగేది అంతా నిబంధనలకు విరుద్ధమే. కార్యాలయంలో దళారుల హవా కొనసాగుతోంది. కొందరు ఏజెంట్లు అవినీతి అధికారులతో కుమ్మకై వాహనదారులను దోచుకుంటున్నారు. సాధారణంగా ఆర్టీఓ కార్యాలయ సేవల కోసం ఆన్‌లైన్‌లో సారథి పరివాహన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి స్లాట్ బుక్ చేసుకుని నిర్ణయించుకున్న తేదీ మేరకు అక్కడికి వెళ్లిన వారిలో వందలో పది మంది కూడా పని పూర్తి కాదు. దళారులను కాదని నేరుగా వెళ్తే ఎల్ఎల్ఆర్ టెస్ట్‌లో ఫెయిల్ చేయడం, దరఖాస్తు ఫారాల్లో కొర్రీలు చూపడం, టెస్ట్ డ్రైవింగ్‌లో చిన్న తప్పిదాలను కూడా పెద్దగా చూపి మళ్లీ దరఖాస్తు చేసుకోమంటారు. చాలా మంది వాహనదారులు ఇదంతా ఎందుకని దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. ప్రస్తుతం ఎలాంటి విద్యా అర్హత లేకపోయినా కేవలం ఆధార్ కార్డు ఉంటేనే డ్రైవింగ్ లైసెన్స్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నాయి. ఇది ఒక విధంగా విద్యార్హత లేనివారికి అవకాశం. అయితే లైసెన్స్ పొందే ప్రక్రియపై అవగాహన లేకపోవడంతో చాలా మంది దళారుల బారిన పడుతున్నారు. ఇదే అవకాశంగా తీసుకొని కొంతమంది దళారులు, కార్యాలయంలో కొందరు సిబ్బంది కుమ్మక్కై దర్జాగా దందా కొనసాగిస్తున్నారు. నిర్ణీత ఫీజు కంటే మూడింతలు మేర గుంజుతున్నారు.



నంద్యాల ఆర్‌టీఓ కార్యాలయం

లైసెన్స్ రకం	ప్రభుత్వ ఫీజు	దళారుల రేట్లు
టూవీలర్ ఎల్ఎల్ఆర్	రూ.260	రూ. 1,000–1,500
టూవీలర్ డ్రైవింగ్ టెస్ట్	రూ.960	రూ.1,000–1,200
ఫోర్ వీలర్ ఎల్ఎల్ఆర్	రూ.260	రూ.500–1,000
ఫోర్ వీలర్ డ్రైవింగ్ టెస్ట్	రూ.1,260	రూ.1,800–2,500
2+4 ఎల్ఎల్ఆర్	రూ.410	రూ.1,500–2,000
2+4 డ్రైవింగ్ టెస్ట్	రూ.1260	రూ.2,500–3,000

డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులూ అంతే

ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఉండే దళారులతో పాటు డ్రైవింగ్ స్కూళ్ల నిర్వాహకులు కూడా దందాలో భాగస్వాములవుతున్నారు. కారు డ్రైవింగ్‌తో పాటు లైసెన్స్ కూడా తామే ఇప్పిస్తామని భారీగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కారు డ్రైవింగ్ కోసం నెలకు రూ.3,500 నుంచి రూ. 4వేలు వసూలు చేస్తారు. వీటితో పాటు లైసెన్స్ కోసం అదనంగా రూ.2,500 నుంచి రూ.3వేలు వసూలు చేస్తున్నారు. హెవీ లైసెన్స్ పొందాలంటే భారీగా ముట్టజెప్పాల్సి వస్తోంది. హైవీ లైసెన్స్‌కు రూ.10వేలు నుంచి 15వేల వరకు వసూలు చేస్తుండటం గమనార్హం. వాటిలోనే లారీ డ్రైవింగ్ శిక్షణ తీసుకున్నట్లు సర్టిఫికెట్ కూడా మంజూరు చేస్తున్నారు. దళారుల దందాలో కార్యాలయంలో కొందరు అధికారులకు మామూళ్లు అందుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

దళారులను ఆశ్రయించొద్దు



ఆర్టీఓ కార్యాలయంలో దళారులకు ప్రవేశం లేదు. ఇప్పటికే కార్యాలయ సమీపంలోని దళారుల షాపులను తొలగించాం. ఏ పనికైనా సచివాలయం, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే వచ్చే స్లాట్ ప్రకారం డ్రైవింగ్ టెస్ట్‌లు, ఎల్ఎల్ఆర్‌లు కార్యాలయ ఇన్‌స్పెక్టర్లు ద్వారా చేస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్నారు. వాహనదారులు దళారులను ఆశ్రయించవద్దు.

– శ్రీకాంత్, డీటీఓ, నంద్యాల

ఇరువర్గాల ఘర్షణ

రుద్రవరం: చిత్రేనిపల్లెలో పొలం గట్టు విషయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గ్రామానికి చెందిన సంటెన్న, అదే గ్రామానికి చెందిన బాలచంద్రుడు, నాగేంద్ర, చంద్ర గురువారం పొలం గట్టు విషయంలో వాగ్వాద పడుతూ ఘర్షణ పడ్డారు. కాగా తనపై దాడి చేశారని సంటెన్న ఫిర్యాదు చేయడంతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రామసుబ్బయ్య తెలిపారు.

96 శాతం హాజరు

కర్నూలు సిటీ: ఆర్‌యూ పరిధిలో జరుగుతున్న పీజీ పరీక్షలకు గురువారం 96 శాతం మంది హాజరయ్యారు. వర్సిటీతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 690 మందికి గాను 659 మంది హాజరయ్యారు.

పాండురంగడి ఉత్సవాలకు వేళాయే!

- మహిమాన్వితుడు.... పాండురంగ విఠలేశ్వరుడు
- 500 సంవత్సరాల చరిత్ర కల్గిన స్వామి
- 30 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



కొత్త శోభ సంతరించుకున్న ఆలయ ముఖద్వారం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న పాండురంగ విఠలేశ్వరుని ఆలయం, (ఇన్‌సెట్) శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి

కోవెలకుంట్ల: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు విరాజిల్లుతున్నాడు. పట్టణంలో వెలసిన ఈ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి ఏటా వైశాఖ మాసంలో మతసామరస్యానికి ప్రతీకగా 12రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 30వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభకానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

శ్రీకృష్ణ దేవరాయల కాలంతో ముడిపడిన ఆలయ చరిత్ర

పాండురంగ విఠలేశ్వర ఆలయానికి ప్రత్యేక చరిత్ర ఉంది. శాలివాహనశకం 1493వ సంవత్సరంలో పెనుగొండ మహారాజు తిరుమలదేవమహారాయలు దేశాటనకై ఈ ప్రాంతానికి వచ్చినట్లు చరిత్ర. ఇక్కడున్న జుర్రేరు, కుందూనది జీవనదులుగా ప్రవహిస్తూ చింతవనాలు, నీటికుంటలతో ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండటంతో ఇక్కడ ఆయన విడిదిచేశారు. ఈ ప్రాంతం గురించి కోవెల అనే భక్తురాలి నుంచి వివరాలు తెలుసుకుంటున్న సమయంలో ఒకరోజు రాత్రి శ్రీపాండురంగ విఠలేశ్వరుడు రాజుకు, కోవెలకు కలలో వచ్చి ఇక్కడ ఒక ప్రాంతం కనుమరుగైందని, గ్రామం నిర్మించి దేవాలయం కట్టించాలని చెప్పినట్లు పూర్వీకుల చరిత్ర. ఇరువురికీ ఒకటేకల వచ్చిందని తెలియడంతో అదే సంవత్సరంలో ఒక పెద్ద దేవాలయం నిర్మించి తిరుమలదేవ మహారాయలచేత విగ్రహప్రతిష్ఠ గావించినట్లు శిలాశాసనం చెక్కించారు. కనుమరుగైన గ్రామాన్ని తిరిగి నెలకొల్పడంతో భక్తురాలి పేరుమీద ఈ ప్రాంతానికి కోవెలగా నామకరణం చేశారు. కుంటలో నుంచి గ్రామాన్ని తీసి నిర్మించడం వల్ల కోవెలకుంట... కాలానికనుగుణంగా కోవెలకుంట్లగా మార్పుచెందింది.

నిత్యపూజలందుకుంటున్న స్వామి

పాండురంగవిఠలేశ్వరుడు నాటి నుంచి నిత్యపూజలందుకుంటున్నారు. ఐదు శతాబ్దాల కాలం నాటి పురాతన ఆలయం కావడంతో 2018వ సంవత్సరం దాతల సహకారంతో రూ. 1.50 కోట్లతో ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. రూ. 10 లక్షలతో ఆలయ గర్భగుడి జీర్ణోద్ధరణ, రూ. 10 లక్షలతో ఇత్తడి తొడగులు, రూ. 5 లక్షలతో వెండి తొడగులు, రూ. 20 లక్షలతో ఆలయం లోపల, ఆవరణలో ఫ్లోరింగ్, రూ. 4 లక్షలతో ఆర్చీల అభివృద్ధి, రూ. 5 లక్షలతో అద్దాల కల్యాణ మండపం, రూ. 4 లక్షలతో పురాతన బావి, రూ. 5 లక్షలతో మూలవిరాట్ విగ్రహాలు, రూ. 5 లక్షలతో ఆలయ ప్రాంగణంలో సీసీ రోడ్లు, రూ. 10 లక్షలతో గార్డెన్, రూ. లక్షతో పిల్లల పార్కు, రూ. 10 లక్షలతో షాపింగ్‌కాంప్లెక్స్, రూ. 50 లక్షలతో ఇతర అభివృద్ధి పనులతో ఆలయానికి పూర్వ వైభవం వచ్చింది.



స్వామివార్ల కల్యాణానికి అద్దాల కల్యాణమండపం



ఆలయం ఎదుట కోనేరు

30 నుంచి బ్రహ్మోత్సవాలు మొదలు

పట్టణంలో వెలసిన పాండురంగస్వామి దేవాలయంలో ఈ నెల 30వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున కోట, వచ్చే నెల 1న ద్వాదశ కుంభహారతి, పేట, 2న కోనేటి తిరునాల, 3వతేదీ అర్ధరాత్రి స్వామివారి కల్యాణం, 4న స్వామివారు హనుమద్వాహనం, 5న సింహవాహనం, 6న శేషవాహనం, 7న గరుడ వాహనం, 8న గజేంద్రవాహనంతో స్వామి వారు భక్తులకు కనువిందు చేయనున్నారు. 9వ తేదీన పూర్ణాహుతి, రథోత్సవం, 10న మైల తిరునాల, 11వ తేదీన వసంతోత్సవం, నాకబలితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

పాఠశాలలో నాగు పాము కలకలం

డోన్ టౌన్: మండల పరిధిలోని వెంకటాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం నాగుపాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. స్కావెంజర్ సహాయంతో పామును చంపేశారు. తరచూ పాఠశాలలోకి పాములు ప్రవేశిస్తుంటాయని, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రహరీ నిర్మించాలని కోరారు.

ఏపీజీబీ సేవలు విస్తృతం

తుగ్గలి: రాష్ట్రంలోని పది జిల్లాల్లో 552 బ్రాంచ్‌లతో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) విస్తరించి ఉందని, రూ.43,560 కోట్లతో లావాదేవీలు జరుగుతున్నాయని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్‌కశ్యప్ తెలిపారు. గురువారం జొన్నగిరిలో నూతన భవనంలోకి బ్యాంక్ కార్యాలయాన్ని మార్పు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. డిపాజిట్లపై అన్ని బ్యాంకు కంటే ఏపీజీబీ అధిక వడ్డీ ఇస్తోందన్నారు. పంట రుణాలతోపాటు పాడుపు, హౌసింగ్, వాహన, వ్యాపార తదితర అన్ని రకాల రుణాలు ఇస్తున్నామన్నారు.

847 మొబైల్ ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను చూపుతున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: బాధితులు పోగొట్టుకున్న 847 మొబైల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి గురువారం అందజేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మొబైల్ రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు 9121101107 నెంబర్‌కు హాయ్ అని ఎస్ఎంఎస్ చేసే వచ్చే లింక్ ద్వారా ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఫిర్యాదు మేరకు వారి వినియోగించే మొబైల్‌లో ఉన్న ఐఎమ్ఈఐ నెంబర్ ద్వారా దాదాపుగా 847 సెల్‌ఫోన్లు గుర్తించామన్నారు. వీటిని మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, తెలంగాణ ప్రాంతాల నుంచి తెప్పించి ఇచ్చామన్నారు. వీటి విలువ సుమారు రూ. 1.50 కోట్లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, సీఐ జయరాములు, ఎస్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కోమటి జయమ్మ(ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని అలువాల గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కోమటి జయమ్మ(116) గురువారం ఉదయం మృతిచెందారు. భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందగా ఈమె గ్రామంలో కిరాణం షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఈమెకు కుమారుడు వీరస్వామి, కుమార్తె ఉన్నారు. తన జీవిత కాలంలో నాలుగు తరాల వారిని ఈమె చూశారు. జయమ్మకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, వృద్ధాప్యం కారణంగానే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. శతాధిక వృద్ధురాలికి గ్రామస్తులు నివాళి అర్పించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- 24 తులాల బంగారు, 26 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం

బొమ్మలసత్రం: గడివేముల మండలం బూజునూరు గ్రామంలో ఇటీవల ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ఇద్దరి నిందితులను గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి నిందితుడి వివరాలను మీడియాకు వివరించారు. ఈనెల 16వ రాత్రి బూజునూరు గ్రామానికి చెందిన జనార్దన రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి మిద్దెపై నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ స్క్రూలు తొలగించి బీరువాలో ఉన్న 24 తులాల బంగారు , 26 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

దొంగల కోసం గాలిస్తుండగా బుధవారం గడివేముల సమీపంలో ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పరుగులు తీశారు. ఇద్దరిని పోలీసులు పట్టుకోగా మరో వ్యక్తి తప్పించుకున్నాడు. పట్టుబడిన నంద్యాల మండలం పెద్దకొట్టాల గ్రామానికి చెందిన గోగుల రవీంద్రబాబు, నంద్యాల పట్టణానికి చెందిన అల్లూరి బాలదస్తగిరిని విచారించగా బూజునూరులో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. పరారీలో ఉన్న నిందితుడు గోగుల పెద్ద సుబ్బరాయుడుగా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డీఎస్పీ మహేశ్వరరెడ్డి, పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ వెంకటసుబ్బయ్యను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జలకళ బోర్లపై సామాజిక తనిఖీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ జలకళ బోర్ల తవ్వకం పారదర్శకంగా ఉండాలనే లక్ష్యంతో గ్రామీణాభివృద్ధి శాఖ సోషల్ ఆడిట్ నిర్వహిస్తోంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సోషల్ ఆడిట్ టీమ్‌లు ప్రతి బోరును క్షుణంగా పరిశీలిస్తున్నాయి. రెండు జిల్లాలో 14 మంది సామాజిక తనిఖీల్లో నిమగ్నమయ్యారు. 2021 జూలై నుంచి 2022 జూన్ వరకు వేసిన ప్రతి బోరును సోషల్ ఆడిట్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. కర్నూలు జిల్లాలో 640 బోర్లు, నంద్యాల జిల్లాలో 535 బోర్లు వేశారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రైతుల సమక్షంలో బోరును పరిశీలిస్తున్నారు. ఎంబుక్ ప్రకారం కొలతలు ఉన్నా యా? కేసింగ్ పైపు ఎన్ని అడుగులు వేశారు? తదితర వివరాలు తెలుసుకుంటున్నారు.

బేతంచెర్లలో రావుబహదూర్ శేషారెడ్డి విగ్రహం

కొత్తపేట: రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తాత రావుబహదూర్ బీపీ శేషారెడ్డి కాంస్య విగ్రహం తూర్పుగోదావరి జిల్లా కొత్తపేట వుడయార్ శిల్పశాలలో రూపుదిద్దుకుంటుంది. నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం బేతంచెర్లలోని మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డికి చెందిన విద్యాసంస్థల ప్రాంగణంలో శేషారెడ్డి 8 అడుగుల నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని నెలకొల్పనున్నారు. ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డీ రాజ్‌కుమార్ వుడయార్ శిల్పశాలను మంత్రి బుగ్గన గురువారం సందర్శించి, శేషారెడ్డి నమూనా విగ్రహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి, శిల్పికి పలు సూచనలు చేశారు. అనంతరం శిల్పకళా ప్రాంగణంలో జాతీయ నాయకులు, చరిత్రకారులు, కళాకారుల విగ్రహాలను పరిశీలించి, విగ్రహాలను జీవకళతో మలిచారంటూ శిల్పి రాజ్‌కుమార్ శిల్పకళా నైపుణ్యాన్ని అభినందించారు.



శేషారెడ్డి నమూనా విగ్రహం వద్ద మంత్రి బుగ్గన

ప్రాణాలు తీసిన ఈత సరదా

- పెద్దచెరువులో నీట మునిగి ఇద్దరు మృతి
- మృతులిద్దరూ బావ,బామర్దులు

బొమ్మలసత్రం: ఈత సరదా రెండు ప్రాణాలను బలి తీసుకుంది. పని మీద బయటకు వెళ్లిన ఇద్దరూ వ్యక్తులు విగతజీవులుగా తిరిగొచ్చారు. నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలోని పెద్దచెరువులో నీట మునిగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. తాలుకా ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న చంద్రశేఖర్, శివలింగమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు సంతానం. చిన్నవాడైన హరికృష్ణ (27)కు రెండేళ్ల క్రితం గిద్దలూరుకు చెందిన యువతితో వివాహం చేశారు. వీరికి ఆరు నెలల బాలుడు ఉన్నాడు. సొంతంగా బొలేరో క్యాంపర్ వాహనం నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వాహనం రిపేరి కావటంతో బుధవారం ఆటోనగర్‌కు వెళ్లాడు. అలాగే తన మేనత్త చిన్న కుమారుడు మహేష్‌బాబు(16) కూడా వెంట వెళ్లాడు. అయితే రాత్రి ఎంతసేపటికీ ఇద్దరు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వారి సెల్‌ఫోన్లకు కాల్ చేశారు. అయితే వారి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళన చెందారు. రాత్రి మొత్తం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం చెరువు కట్ట మీద వాహనం ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాన్ని పరిశీలించగా అందులో దుస్తులు, సెల్‌ఫోన్‌లు,



మృతి చెందిన మహేష్‌బాబు, హరికృష్ణ (ఫైల్)

పర్సులు ఉండటంతో చెరువులో దిగి నీటిలో గల్లంతై ఉంటారని అనుమానించారు. ఈ మేరకు ఫైర్ సిబ్బంది సహకారంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో ఇద్దరు మృతదేహాలు నీటిపై తేలడంతో బయటకు తీశారు. వాహనం రిపేరి చేయించిన అనంతరం ఇద్దరు కలిసి ఎస్‌బీఐ కాలనీలో ఉన్న పెద్దచెరువు వద్దకు స్నానం చేసేందుకు వెళ్లి లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహేష్‌బాబు ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు కావడంతో హరికృష్ణతో పాటు వాహనంలో తిరుగుతున్నాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. చేతికొచ్చిన కుమారుడు నీటిలో శవమై తేలడంతో తల్లి నాగమణి కన్నీరుమున్నీగా విలపిస్తోంది. మహేష్ బాబు తండ్రి బుగ్గన్న గత కొంత కాలం క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ విద్యార్థి మృత్యువాత



వేణుగోపాల్(ఫైల్)

గోనెగండ్ల: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. పెద్దనేలటూర్ గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చాకలి శ్రీరాములు, సువర్ణ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వీరు తమ పెద్దకుమారుడు వేణుగోపాల్(17)ను గోనెగండ్ల జూనియర్ కళాశాలలో ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. గురువారం స్నేహితులు ఐదుగురితో కలిసి వేణుగోపాల్ సరదాగా ఊరి చివరలోని బావిలో ఈతకు వెళ్లాడు. ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోవడంతో తోటి స్నేహితులు కేకలు వేశారు. సమీపంలో ఉన్న వారు వచ్చి బావిలో వెతికి కొద్ది సేపటికి నీటిలోంచి వేణును బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

హత్య కుట్రను భగ్నం చేసిన పోలీసులు

- రూ. పది లక్షలకు సుఫారీ
- పోలీసుల అదుపులో నలుగురు

బొమ్మలసత్రం: బేతంచెర్ల మండలం రంగాపురం గ్రామానికి చెందిన మహమ్మద్ షరీఫ్‌ను తన సమీప బంధువు రఫి హత్య చేసేందుకు మరి కొంత మంది కుట్ర పన్నుతుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ కె రఘువీర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రుద్రవరం మండల కేంద్రానికి చెందిన రఫికి సమీప బంధువైన షరీఫ్‌తో కొంత కాలంగా మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో షరీఫ్‌ను అంతమొందించేందుకు కిరాయి హంతకులైన రెడ్డి పల్లె బాషా, పెద్దకొట్టాల వడ్డే సుబ్బరాయుడు, పెద్ద శేఖర్‌బాబు, మదనగోపాల్‌లతో కలిసి గడివేముల మండలం బిలకలగూడూరు సమీపంలో మంతనాలు సాగిస్తున్నారు. వారిని గమనించిన ఎస్ఐ వెంకటసుబ్బయ్య అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు కుట్ర పన్నుతున్నట్లు అంగీకరించారు. హత్యకు రూ.10 లక్షలు ఒప్పుకుని, ముందుగా రూ.3 లక్షలు తీసుకున్నట్లు నిందితులు పేర్కొన్నారు. కేసును సుమోటోగా తీసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు.

ఫలితాల్లో ప్రథమం బీసీ గురుకులం

పాణ్యం: నంద్యాల జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత సాధించిన కళాశాలగా నెరవాడ మెట్ట వద్ద ఉన్న బీసీ రెసిడెన్షియల్ బాలికల కళాశాల నిలిచింది. మొదటి సంవత్సరంలో 101 మందికిగాను 95 మంది (94.05 శాతం), ద్వితీయ సంవత్సరంలో 95 మందికిగాను 92 మంది (96.84శాతం) విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 42 మందిగాను 37 మంది, బైపీసీలో 32మంది గాను 31మంది పాస్ అయ్యారు. సీఈసీలో 27 పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఎంపీసీలో రిజ్వానా 470గాను 438, బైపీసీలో ధనలక్ష్మి 440గాను 420, సీఈసీలో తులసి 500గాను 469 మార్కులు సాధించారు.

- ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 29 మందిగాను 26 మంది, బైపీసీలో 21గాను 21, సీఈసీలో 24–24, ఎంఈసీలో 21గాను 21 మంది పాసయ్యారు. ఎంపీసీలో ఓ. రాజ్యలక్ష్మి 955, బైపీసీలో ప్రవీణ 966, సీఈసీలో నందిని 879, ఎంఈసీలో ప్రవళ్లిక 930 మార్కులు సాధించారు. సిబ్బంది సహకారంతో ఇంటర్‌మీడియెట్ ఫలితాల్లో కళాశాల జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ జయమ్మ తెలిపారు.



విజయ సంకేతం చూపుతున్న బీసీ గురుకుల విద్యార్థినులు

పంచలింగాల కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (న్యూటౌన్): ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో కర్నూలు మండలం పంచలింగాల కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ ఎం. స్వప్న కుమారి తెలిపారు. తమ కళాశాలకు చెందిన 28 మంది పరీక్ష రాయగా 26 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరంలో అకౌంట్స్ అండ్ ట్యాక్సేషన్ గ్రూపులో టి నందిని 970 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు చెప్పారు. ఎస్ వెంకటేశ్వరి 966, బి ఊహ 959, ఎల్ అఖిల 957, బి మేఘన 955, బి అశ్విని 948 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 19 మంది హాజరవ్వగా 12 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బి రూహీ 500కు 466 మార్కులు సాధించినట్లు వెల్లడించారు.



నందిని,



రూహీ